RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాల వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# బంగారం ధరలను నిర్ణయించేదెవరు ?

బంగారం ధరలను ఎవరు నిర్ణయిస్తారు..ఇది అతి పెద్ద ప్రశ్న. సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు ఉన్న భేతాళ ప్రశ్న. పెట్టుబడులు పెడుతూ పోతుంటే..అమ్మకాలు పెరిగితే ధరలు తగ్గాలి. కానీ తగ్గడం లేదు. ఇటీవల ఒక్కరోజులో 9వేలు తగ్గిందని తెగ ప్రచారం చేశారు. కానీ ఎంత పెరిగితే 9 వేలు తగ్గిందో చెబితే బాగుండేది. నిజానికి ఇప్పటికే సామాన్యులు వన్ గ్రామ్ గోల్డ్‌పై మోజు పెంచుకున్నారు. గిల్టు నగలకు ప్రాధన్యం పెరిగింది. బంగారంతో పోలిస్తే దీనిని అట్టే గుర్తించలేం. ప్రపంచ వ్యాప్తంగా బంగారం నిల్వలు, పెరుగుదలపై అన్నీ భేతాళ కథలే వినిపిస్తున్నాయి. నిజానికి బంగారం మీద మోజు తగ్గించుకుంటే జీవితాలు బగుపడతాయి. బంగారంపై పెట్టే పెట్టుబడులు ఇతరత్రా రంగాలపై పెడితే మంచిది. బంగారం ధరలు పెరగడం వల్ల మనిషి ప్రాణ్యాలకు విలువ లేకుండా పోతోంది. తులం బంగారం మెడలో వేసుకుని వెళ్లినా పుటుక్కున చంపేసి లాక్కెళ్లుతున్నారు. ఇటీవల వరుసగా జరిగిన ఘటనలు చూస్తుంటే బంగారం ధరలు పెరగడంతో దొంగలు ప్రాణాలు తీయడానికి కూడా వెనకాడడం లేదు. బంగారం, వెండి ఏది ఉన్నా ప్రాణాలమీదకు రావడం ఖాయం. బంగారం, వెండి ధరలు ఇలా అనూహ్యంగా పెరుగుతూ పోతుంటే సామాన్యలు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టక తప్పడం లేదు. బంగారానికి వన్ గ్రామ్ గోల్డ్ ఆర్నమమెంట్లు వచ్చినట్లే ..వెండిలో జర్మన్ సిల్వర్ అందుబాటులోకి వచ్చింది. ఇది కూడా ఎవరు గుర్తించలేరు. అచ్చు వెండిలాగే ఉంటుంది. ఇప్పుడు పెళ్లిళ్లు పేరంటాల్లో జర్మన్ సిల్వర్ తళుక్కుముంటోంది. ఫోటో గ్రఫీ కోసం వన్ గ్రామ్ గోల్డ్ నగలు మెరిసి పోతున్నాయి. ప్రజలు తమవల్ల కానప్పుడు వ్యామోహం తగ్గించుకుంటారనడానికి ఈ రెండు లోహాల వాడకాన్ని గుర్తించవచ్చు. అయితే భారతదేశంలో బంగారం ధరలు గతంలో ఎప్పుడూ లేనంతగా మరొకసారి చరిత్ర సృష్టిస్తున్నాయి. ఆగస్టు నుండి బంగారం ధరలు ప్రతివారం మూడు నుండి నాలుగుసార్లు కొత్త రికార్డులు సృష్టిస్తూ, ఆకాశాన్నంటుతున్నాయి. వరుసగా ధరల పెరుగు దలతో బంగారం ధరలు ఆల్‌టైమ్ హైని తాకాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న జియోపాలిటికల్ ఉద్రిక్తతలు, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం, అలాగే అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ పెట్టుబడి దారుల నమ్మకంపై దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరల కదలికలపై అందరి చూపు పడింది. భారతదేశంలో బంగారం ధరల నిరంతర పెరుగుదల అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రేట్ల పెరుగుదలతో సమాంతరంగా కొనసాగుతోంది. పెట్టుబడిదారులు భద్రతా ద్రవ్యంగా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళి వారంలో రికార్డు స్థాయిలను తాకిన తర్వాత, అక్టోబర్ 24న భారతదేశంలో బంగారం మరియు వెండి ధరలు కొంత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో లాభాల బుకింగ్,డాలర్ బలపడటం వల్ల ధరల్లో స్వల్ప సవరణ కనిపించింది. బంగారం మరియు వెండి ధరలు పరిశీలిస్తే తాజాగా 24 క్యారెట్ బంగారం గ్రాముకు 12,507, 22 క్యారెట్ బంగారం గ్రాముకు 11,464, 18 క్యారెట్ బంగారం గ్రాముకు 9,380 గా ఉంది. వెండి కిలో ధర 1.59 లక్షలుగా నమోదైంది. దీపావళి ర్యాలీ తర్వాత ఇది మార్కెట్ సాధారణ సవరణగా పరిగణించబడుతోంది. మొత్తంగా బంగారం ధరల పెరుగుదల ఇప్పుడు కొందరికి ఆనందంగానూ ఉంది. తరతరాలుగా ఇంట్లో మూలుగుతున్న బంగారం ఉన్న వాళ్లకు ఇదో ఆస్తిగా నిలుస్తోంది. తులం బంగారంపై బ్యాంకులు కూడా 70 నుంచి 80 వేల వరకు రుణాలను ఇస్తున్నాయి. సామాన్యులకు దూరమవుతున్న బంగారం సంపన్నులకు చేరవవుతోందని చెప్పలేం. ఇప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు రికార్డుల్ని తిరగ రాస్తోంది. దేశీయ మార్కెట్లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు,పండగ, పెళ్లిళ్ల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తాంది. బుధవారం నాడు హైదరాబాద్లో రూ.1.30 లక్షలు దాటింది. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3వేలు ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం మీద పెట్టే పెట్టుబడులకు మంచి భద్రత ఉందన్న మాట ఎవరూ కాదనలేరు. అలాగని బంగారం పెరుగుతుందో పెరగదో, ఒక వేళ తగ్గుతుందా, ఎలాంటి పరిస్థితుల్లో తగ్గుతుంది, ఎప్పుడు జాగ్రత్త పడాలి, ఎలా జాగ్రత్త పడాలన్న అంశాలపై పూర్తి అంచనా, విశ్లేషణలు అవసరం. ఎందుకంటే ఒక్కోసారి మనం కొన్న ధరలు అలాగే ఉంటాయని అనుకోవడానికి లేదు. ఏ క్షణమైనా ధమాల్ మని అనవచ్చు.

అప్పుడే బంగారం లాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు. వీటిపై ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. బంగారం ధర పెరుగుతుందనో, తగ్గుతుందనో ఊహించడమంటే అదొక లాటరీగానే భావించాలి. మార్కెట్ విశ్లేషకుల అంచనా కూడా ఇదే. కొందరైతే సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని విశ్లేషణలు గమనిస్తే కిలో బంగారం ఖరీదు బాగా తగ్గుతుందంటున్నారు. కనుక అంతవరకు ఆగితేమంచిదని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ తగ్గితే ఆడవారికి ఊరటే. మరో పక్కన ఆకాశం పైకెగురుతున్న ధర నేలచూపులు చూసే అవకాశమే ఉందని, అంతర్జాతీయ స్థాయిలో మార్పులు వస్తే తగ్గడం ఖాయమంటున్నారు. ప్రధానంగా దుబాయ్ వంటి అరబ్ దేశాలలో, భారతదేశంలో మహిళలు బంగారాన్ని ఆభరణాలుగా చేయించుకుని ధరించేందుకు మోజు పడ తారు. అలా బంగారాన్ని దాచుకున్న వాళ్ళకి ఇప్పుడు అనూహ్యంగా ధనం వచ్చి చేరినట్లే. ఎందుకంటే కాస్త బంగారం ఉన్నా ప్రత్యామ్నాయ పెట్టుబడులకు ఉపయోగపడుతున్నాయి. వాటిపై బ్యాంకు రుణాలి స్తున్నాయి. మానవారి అవసరాలు తీరుతున్నాయి. ఏదైనా వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాలన్నా వారిని బంగారమే నిలబడుతోంది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎన్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబ డులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమం లోనే గోల్డ్ వెండికి గిరాకీ విపరీతంగా ఉంటోందని విశ్లేషణలు వస్తున్నాయి. భౌతిక రాజకీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంతో ఈ ఏడాది ఇంతవరకు బంగారం ధర 67 శాతం పెరిగింది. మార్కెట్ అనిశ్చితులు ఇలాగే ఉంటే బంగారం మోజు తగ్గించుకోవడమే శ్రేయస్కరం. ఒకప్పుడు షేర్ మార్కెట్ మీద ఇలాంటి అంచనాలతో జనం పెట్టుబడిపెట్టేవారు. అలా పెట్టుబడి పెట్టి మోసపోయిన వారూ ఉన్నారు. కాబట్టి ఈ పెరుగుదలతో ఆనందపడరాదు. మోసపోరాదు.

# నేడే నాగుల చవితి పర్వదినం

## ■ పుట్టలో పాలు పోయడం ఆచారం

అక్టోబర్24 (పద్మక్రాంతి):

హిందూ సంప్రదాయంలో పండగలకు, ఆచారాలకు విశేష ప్రాధాన్యం ఉంది. కార్తీక మాసంలో వచ్చే అనేక పర్వదినాలు, పూజలు ఇందుకు నిదర్శనం. ఇందులో భాగంగా శనివారం వచ్చే నాగులచవితికి గాను పాములకు పాలు పోయడం అన్నదానికి విశేషమైన ప్రాధ్యాన్యత ఉంది. పాములను పూజించడం హిందూ ఆచారంలో ఓ భాగం. అయితే.. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థి నాడు నాగుల చవితి పండుగను జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో శ్రావణ శుద్ధ పంచమి రోజు కూడా జరపుకుంటారు. కానీ తెలుగు రాష్టాల్లో కార్తీక మాసంలో నాగుల చవితి పండుగ ఆచరిస్తారు. ఈ ఏడాది ఈ నాగుల చవితి ఈ నెల 25న అంటే శనివారం జరుపుకోనున్నారు. వ్యవసాయానికి దన్నుగా పాములు సహాయకారికగా ఉంటాయని ప్రతీతి. ముఖ్యంగా పంటలు నాశనం చేసే ఎలుకలను పాములు పట్టుకుని తింటాయి. ఇలా పాములకు కృతజ్ఞతగా చవితి రోజు పుట్టలో ఆలు పోయడమనే ఆచారం పుట్టిందని అంటారు. ప్రకృతి, జంతువుల పట్ల గౌరవ సూచికంగా కూడా వేడుకను చేసుకుంటారు. నాగ దేవతల పూజకు శుభ ముహూర్తం అంటూ ఏదీ ఉండదు. వేకువ జామున లేచి పుట్టలో పాలు పోయడమే ఆచారంగా వస్తోంది. నాగుల చవితి పండుగ రోజు భక్తులు పుట్టలో ఆవు పాలతో పాటు గుడ్లు వేస్తారు. చలిమిడి, చిమ్మిరి నైవేద్యంగా చేసి నాగదేవతకు సమర్పిస్తారు. అలాగే జంట నాగుల విగ్రహాలకు పాలు, పసుపు, కుంకుమతో అభిషేకం చేస్తారు. మహిళలు సౌభాగ్యం కోసం, సంతానప్రాప్తి కోసం సర్పపూజ చేస్తారు. నాగుల చవితి రోజు నాగదేవతను పూజించడం వల్ల రాహువు గ్రహం యొక్క దుష్ప్రభావాలను తగ్గించుకోవచ్చన్న ప్రచారం కూడా ఉంది. అలాగే కుజ దోషం, కాల సర్ప దోషాలు తొలగిపోతాయని నమ్మకం. ఇక పురాణాల ప్రకారం నాగుల చవితి పండుగ గురించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. దాదాపు ప్రతి దేవాలయం లో





నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. అయితే నాగుల చవితి రోజున నాగేంద్రుడు పరమేశ్వరుడికి వాసుకిగా, శ్రీమహావిష్ణువుకి ఆదిశేషుగా మారి తోడుగా ఉంటాడట. అందుకే ఈ పవిత్రమైన నాగుల చవితి రోజున భక్తులందరూ నాగదేవతను పూజిస్తే సంర్వరోగాలు తొలగిపోతాయని నమ్మకం. అంతే కాకుండా ఈ రోజున సంతానం లేని దంపతులు నాగారాధన చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని కూడా భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. నాగదోషం, రాహు కేతు దోషాలు ఉన్న వారు కూడా నాగుల చవితి రోజున నాగేంద్రుడిని పూజిస్తే దోషాలన్నీ తొలగిపోతాయని విశ్వసిస్తారు.

# మన మహిళల వద్ద 24 నుంచి 25వేల టన్నుల బంగారం

## ■ నెటిజన్ పోస్ట్‌పై స్పందించిన ఆనంద్ మహీంద్రా

న్యూఢిల్లీ,అక్టోబర్24(పద్మక్రాంతి):

కొన్ని రోజులుగా భారత్‌లో బంగారం వార్తలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భారత ప్రజలకు మరీ ముఖ్యంగా మహిళలకు పసిడి అంటే మక్కువ ఎక్కువ. వారివద్ద 24వేల నుంచి 25వేల టన్నుల బంగారం ఉందని, అది అమెరికా, జర్మనీ వంటి దేశాల వద్ద ఉన్న పుత్తడి కంటే ఎంతో ఎక్కువ అని ఓ నెటిజన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మంచి ఉద్దేశంతో పాటు ఆలోచింపజేసేలా ఉండే సందేశాలను ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. తాజాగా చిన్ననాటి అనుభవాన్ని నెటిజన్లతో పంచుకున్నారు. భారత ప్రజల ఐక్యతను ప్రతిబింబించిన సందర్భాన్ని వెల్లడించారు. ఓ నెటిజన్ వేసిన అంచనాకు సంబంధించి ఆనంద్ మహీంద్రా స్పందించారు. 'ఆకట్టుకునే గణాంకాలు' అంటూ బదులిచ్చిన ఆయన.. ఈ గణాంకాలు 60 ఏళ్ల క్రితం దేశ ప్రజల సాటిలేని దాతృత్వాన్ని గుర్తుచేస్తున్నాయి. 1962లో చైనాతో యుద్ధం నడుస్తోంది. అందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ డిఫెన్స్ ఫండ్‌ను ఏర్పాటుచేసి, దేశ రక్షణ చర్యల కోసం బంగారం, ఆభరణాలు విరాళంగా ఇవ్వాలని పౌరులను కోరింది. ఈనాటి ధరల ప్రకారం వేల కోట్ల రూపాయల విలువైన పుత్తడిని సేకరించారు. ఒక్క పంజాబ్ నుంచే 252 కిలోల బంగారం విరాళంగా అందిందట. అప్పుడు నా వయసు ఏడు సంవత్సరాలు. ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరుతూ కొన్ని ప్రభుత్వ ట్రక్కులు ముంబయి వీధుల్లో తిరుగుతున్నాయి. అప్పుడు నేను మా అమ్మతో కలిసి బయటే నిలబడి ఉన్నాను. ఆ పిలుపు విన్న నా తల్లి బంగారు గాజులు, హారాలను ఒక గుడ్డలో చుట్టి ట్రక్కులోని వాలంటీర్లకు అందించింది. ఎంతో నిశ్శబ్దంగా తనకు ఉన్నంతలో దాతృత్వాన్ని చాటుకుంది. ఆ దృశ్యం నా మనసులో అలా ముద్రించుకుపోయింది. ఆ స్థాయిలో స్వచ్ఛంద ఉదారతను చాటుకునే సందర్భం మరొకటి ఉంటుందా..? అని అప్పుడప్పుడు ఆశ్చర్యం వేస్తుంటుంది. దేశం ఎలాంటి పరిస్థితుల్లోనైనా తట్టుకొని నిలబడగలిగే సామర్థ్యం విధానపరమైన చర్యలపై మాత్రమే గాకుండా ప్రజల సమష్టి సంకల్పంపైనా ఆధారపడి ఉంటుంది. అందుకు ఇదొక





ఉదాహరణ అని మహీంద్రా వెల్లడించారు. ఈ విరాళాలు దేశభక్తిని చాటుకున్న సందర్భం మాత్రమే కాదని దేశ ప్రజల ఐక్యత, విశ్వాసానికి చిహ్నామని రాసుకొచ్చారు. ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం నిల్వలు పెంచుకుంటోంది. ఆ నిల్వల మొత్తం 880 మెట్రిక్ టన్నులు దాటేసింది. గత నెల 26వ తేదీ నాటికి ఈ బంగారం విలువ 95.02 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.36 లక్షల కోట్లు). ఆర్‌బీఐ వద్ద ఉన్న 700.24 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు ద్రవ్యంలో ఈ మొత్తం 13.5 శాతానికి సమానం. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.లక్ష పైనే ఉన్న సంగతి తెలిసిందే. అయితే భారతీయులు ప్రతి సందర్భం లోనూ ఇలా ఐక్యతను చాటుతూ తమవద్ద ఉన్న బంగారాన్ని దేశం కోసం ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

# ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది

- ఐక్యరాజ్య సమితి పసనితీరు అందుకు తగ్గట్లుగా లేదు
- భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్

న్యూఢిల్లీ,అక్టోబర్24(పద్మక్రాంతి):

ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. ఐరాస 80వ వార్షికోత్సవం నేపథ్యంలో పోస్టల్ స్టాంపు విడుదల చేసిన సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడారు. వివాదాల యుగంలో శాంతి అనేది అవసంమని జై శంకర్ పేర్కొన్నారు. ఇటీవల మైనారిటీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలంటూ ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. ఆ దేశం జాత్యహంకారం, క్రమబద్ధమైన వివక్ష, విదేశీయులపై



విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించింది. ముందు వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలని సూచించింది. మరోవైపు.. పహల్గాంలో పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ప్రపంచవ్యాప్తంగా ఖండించినప్పటికీ.. పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. యూఎన్ సమావేశాల్లో పదేపదే కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు భారత్‌పై నిందలు మోపే ప్రయత్నాలు చేస్తుంది. అయితే, భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో జై శంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇక, గురువారం యూఎన్‌లో జరిగిన సమావేశాల్లో పాక్ దౌత్యవేత్తలు ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే, భారత్ వీటిని తీవ్రంగా వ్యతిరేకించింది.

# భారత సంతతి వ్యక్తిపై మూన్‌లైటింగ్ ఆరోపణలు

## ■ కేసు రుజువయితే 15 ఏళ్ల జైలు ఖరారు

వాషింగ్టన్,అక్టోబర్24(పద్మక్రాంతి):

భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతుంది.

# స్లీపర్ బస్సుల్లో ప్రమాదాలు ఎక్కువే

- ఇటీవలే రాజస్థాన్‌లో ఇలాంటి ఘోరమే
- స్లీపింగ్ సిస్టమ్‌తో ప్రమాదం నుంచి బయటపడలేని వైనం

హైదరాబాద్,అక్టోబర్24(పద్మక్రాంతి):

కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న బస్సు దుర్ఘటన అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 10 రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇదేతరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇవే కాదు.. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. వీటి నిర్వహణకు కఠిన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 30 నుంచి 36 బెర్తులు ఉంటాయి. అదే మల్టీ యాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరు అడుగుల పొడవు.. 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీతోనే ఇక్కడ సమస్య. ఈ గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండటంతో ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకైన ప్రాంతం నుంచి వేగంగా బయటకు రాలేకపోతున్నారు. స్లీపర్ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగానే ఉంటున్నా.. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికుల కదలికలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఇక, స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్యగా మారుతోంది. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఉన్నట్టుండి ఒక వైపునకు ఒరిగిపోయినప్పుడు.. ప్రయాణికులు కిటికీలను లేదా ఎమర్జె న్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టంగా మారుతోంది. ఈ ఎత్తు వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు కూడా ఆటంకం కలుగుతోంది. బస్సు ఎక్కి ప్రయాణికులను బయటకు తీసేలోపు మృతుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు. 300 నుంచి 1000 కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. సాధారణంగా ఈ బస్సులు రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట లేదా మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా.. వాటి పనితీరు, సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉన్నాయి. డ్రైవింగ్ సమయంలో తాము నిద్ర మత్తులో ఉంటున్నామని 25శాతం మంది డ్రైవర్లు అంగీకరించినట్లు 2018లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల్లోపు డ్రైవర్లు నిద్రలోకి జారుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. ప్రమాదాల సమయంలో మొదటి రెండు నిమిషాల్లో ప్రతిస్పందించే తీరే అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలోనే ఉంటారు. సీట్లలో మెలకువగా ఉన్నవారు లేదా ప్రమాదం జరిగిన వెంటనే తేరుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక, అప్పర్ బెర్త్‌ల్లో ఉన్నవారు బయటపడటం చాలా క్లిష్టంగా ఉంటోందని అంటున్నారు. ఈ స్లీపర్ బస్సులు తొలుత పశ్చిమదేశాల్లో నడిపేవారు. సిటీల మధ్య వినోద ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. ఆ తర్వాత సాధారణ ప్రజా రవాణాలో ఇవి భాగమయ్యాయి. అయితే, వీటిల్లో జరుగుతోన్న ప్రమాదాల కారణంగా కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నాయి. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 2012లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ధి చెప్పాలి



మొదటి పేజీ తరువాయి ..

కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 5 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి ..

జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నుంచి రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర, రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం బయటపడ్డారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు బస్సు ప్రమాదంలో గాయాలైన వారిని ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమారెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగారు. పోలీసులకు ఆమె సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## ప్రజల ప్రాణాలతో ట్రావెల్స్ బస్సుల చెలగాటం

మొదటి పేజీ తరువాయి ..



రావు తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురైన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య చికిత్సను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా ప్రభుత్వం సమగ్ర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రామచందర్ రావు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భాం÷–రతి వ్యక్తం చేశారు. బస్ ఘటనలో ఎక్కువ సంఖ్యలో మృతులు ఉండటం విషాదకరమన్నారు. మృతులకు తీవ్ర సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

మొదటి పేజీ తరువాయి ..

రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నారా రోహిత్ – శిరీషల వివాహం ఈ నెల అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహ వేడుకలను ఏకంగా నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నారా కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 25న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. అక్టోబర్ 26న సంప్రదాయబద్ధంగా పెళ్లికొడుకు కార్యక్రమం జరగనుంది. అక్టోబర్ 28న మెహందీ వేడుక, 29న సంగీత్ నైట్ నిర్వహించనున్నారు. చివరగా, అక్టోబర్ 30న రాత్రి 10:35 గంటలకు శుభ ముహూర్తాన రోహిత్, శిరీష ఒక్కటవ్వనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు – భువనేశ్వరి దంపతులు పెద్దలుగా ఈ వివాహ వేడుకలో పాల్గొననున్నారు. రోహిత్, శిరీషల పరిచయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వారిద్దరూ కలిసి నటించిన 'ప్రతినిధి?2' సినిమా షూటింగ్ సమయంలోనే స్నేహం ఏర్పడింది. అది క్రమంగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, నిశ్చితార్థం జరిగిన కొద్ది కాలానికే రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూయడంతో పెళ్లిని వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి తేదీ ఖరారు చేశారు. సినీ పరిశ్రమలో ఈ వివాహం'ఈ ఏడాది అత్యంత ఆకర్షణీయమైన స్టార్ వెడ్డింగ్'గా నిలవనుంది.

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

మొదటి పేజీ తరువాయి ..

నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# ప్రమాదంలో మొత్తం 19 మంది మృతి

- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- క్షతగాత్రులకు మంత్రులు అనిత తదితరుల పరామర్శ
- మృతుల కుటుంబాలకు 5లక్షలు..క్షతగాత్రుకలు 2లక్షల పరిహారం
- డిఎన్ఏ పరీక్షల ఆధారంగా ఆనవాళ్లు అప్పగింత
- డ్రైవర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన హోంమంత్రి అనిత

**కర్నూలు,అక్టోబర్24(పద్మక్రాంతి):**

బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారని వెల్లడించారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో మంత్రులు అనిత, రాం ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి




కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బస్సు డ్రైవర్లిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డుపై పడి ఉన్న బైకును ఢీ కొట్టినట్లు బస్సు డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ చెప్పాడు. ప్రమాదానికి గల కారాణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని ఎస్పీ వివరించారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వారిని మంత్రులు పరామర్శించి వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మంత్రుల వెంట డీజీపీ హరీశ్ గుప్తా, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, దస్తగిరి ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి ..

## అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరకులు

పడేది లేదని మందలించారు. లబ్ధిదారులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుకుం జారీ చేశారు. చిన్నారుల సంరక్షణ విషయంలో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన సమయం నుంచి వారు వెళ్లే వరకు సిబ్బంది బాధ్యత వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగు నీటి సదుపాయం, టాయిలెట్ సౌకర్యాల కల్పన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య, హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కనీసం ఒక చిన్నారి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు మంత్రి సీతక్క. ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయనే భరోసాను తల్లిదండ్రులకు కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా ప్రోగ్రెస్ రిపోర్టులు పంపించాలని ఆజ్ఞాపించారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని దిశానిర్దేశర చేశారు. ఈ సమీక్షలో మంత్రి సీతక్కతోపాటు ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల రేటులో ముందున్న డబుల్ ఇంజన్ సర్కార్లు

సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ స్పందించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే.. అవినీతి రహిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బిహార్ రాజధాని పట్నాలో మాట్లాడారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం పాల్పడిన 55 కుంభకోణాల గురించి ప్రధాని మోదీనే వెల్లడించారు. ఆ అవినీతిపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు..? మోసాలు జరుగుతున్నప్పుడు, ఎలాంటి చర్యలు లేనప్పుడు దానిని జంగల్ రాజ్ అంటారని ఎత్తి పొడిచారు. ఆర్జేడీ తేజస్వి వ్యాఖ్యల వేళ.. భాజపా స్పందించింది. ఆయన్ను అవినీతిపరుడని కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్ అభివర్ణించారు. అవినీతికి పర్యాయపదంగా మారిన వ్యక్తి దాని గురించి మాట్లాడుతుంటే షాకింగ్‌గా ఉంది. అపారమైన సంపదను కూడబెట్టుకున్న ఈ కుటుంబం వల్ల బిహార్ వెనక్కి వెళ్లిపోయిందని వ్యాఖ్యలు చేశారు. యాదవ్ కుటుంబసభ్యులు పలు కేసులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ విమర్శలు చేశారు. దీనికిముందు బిహార్ ప్రజలనుద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారని ధ్వజమెత్తారు.

## కర్నూలు బస్సు దుర్ఘటనపై చంద్రబాబు సీరియస్

తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదికను కోరారు. అన్ని జిల్లాల్లో బస్సుల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీచేశారు. ప్రమాదానికి కారణం.. నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు తప్పవని ట్రావెల్స్ బస్సు యాజమాన్యానికి సీఎం హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యత, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం త్వరితగతిన అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నారని సీఎంకు తెలియజేశారు మంత్రి. అలాగే ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

చెలరేగాయి. ప్రమాదం సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా, అందులో బైకర్‌తో పాటు 20మంది చనిపోయినట్లు సమాచారం. ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు.

## వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమాలు

హెబ్రాన్ ఇన్ఫ్రా స్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత వేమూరి వినోద్ కమార్ ఈ బస్సును కొనుగోలు చేసి తీసుకుని కేంద్ర పాలిత ప్రాంతమైన దయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడే వేమూరి కావేరి సంస్థ అక్రమానికి తెరలేపింది. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో దయ్యూ డామన్‌లో చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. దయ్యూ డామన్‌లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్ .. ఒడిశాలోని రాయగడలో ఆల్టేషన్, ఫిట్‌నెస్ చేయించుకున్నారు. రాయగడ అధికారులు ఆల్టేషన్, ఫిట్‌నెస్ మంజూరు చేసేటప్పుడు బస్సు సామర్థ్యం, సీటింగ్ వివరాలను స్పష్టంగా పొందుపరిచారు. కేవలం ప్రమాదానికి గురైన బస్సుకు 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ మాత్రమే ఇచ్చారు. కానీ కావేరి ట్రావెల్స్ సంస్థ స్లీపర్ క్యారియర్‌గా మార్చింది. ఇలా మార్చడం బస్సు సామర్థ్యాన్ని అధిగమించడమే. దయ్యూ డామన్‌లో సీటింగ్ సామర్థ్యం ఉన్న బస్సు రవాణా పన్ను ఒక్క సీటుకు రూ.450 మాత్రమే అదే స్లీపర్ సీటు అయితే రూ.800 అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఛార్జీలు చాలా ఎక్కువ. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటుకు రూ.4500 పన్ను చెల్లించాలి. అదే స్లీపర్ సీటుకు అయితే రూ.12వేల చొప్పును ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించాలి. ఇలా ట్యాక్స్‌లను ఎగవేసేందుకే వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ అక్రమ రిజిస్ట్రేషన్, ఆల్టేషన్ చేయించింది.

పద్మక్రాంతి తెలుగు దినపత్రిక
RNI No : TELTEL/2022/85167

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కమిటీ...

- సభ్యత్వ నమోదు.



పాపన్నపేట. అక్టోబర్. 24 (పద్మక్రాంతి)



పాపన్నపేట.. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అనేక రకాల ఉద్యమాలకు నాంది పలికిందని ఏబీవీపీ మెదక్ విభాగ్ సంఘటన మంత్రి బోడ లక్ష్మణ్ అన్నారు. ఆయన సమక్షంలో శుక్రవారం నాడు పాపన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షులుగా పి సంతోష్ కార్యదర్శిగా వినయ్ .ఉపాధ్యక్షులుగా విక్రం .యాది లక్ష్మి. వంశీ .సహా కార్యదర్శులుగా బాలరాజ్. శ్రీకాంత్. అశ్విని తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయవాదం దేశభక్తి వైపు లక్షలాదిమంది విద్యార్థులను జాతీయవాదులుగా తయారు చేస్తున్న సంస్థ ఏబీవీపీ అన్నారు. చదువుతోపాటు నైతిక విలువలు నేర్చుకోవాలని ఆయన సూచించారు.. సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకున్న విద్యార్థుల కోసం పక్క భవనాలు మంజూరు చేయాలని,, స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఏనుగు బుచ్చిరెడ్డిని పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డికిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం ప్రతినిధి, అక్టోబర్ 24,(పద్మక్రాంతి):

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తుర్క గూడ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు బుచ్చిరెడ్డి, తండ్రి ఏనుగు జంగారెడ్డి గురువారం మరణించారు. ఆ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమం లోజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , మండల పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు , ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్ రెడ్డి , మాజీ సర్పంచ్ కత్తుల పవిత్రకుమార్ , శ్రీనివాస్ రెడ్డి , బి ఆర్ ఎస్ వి నియోజకవర్గం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ , గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్ , వెంకట్ రెడ్డి, బాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి , ప్రేమ్ కుమార్, కొంద్రు రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా కు అంతరాయం

ఇబ్రహీంపట్నం ప్రతినిధి, అక్టోబర్ 24,(పద్మక్రాంతి):



ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కరెంటు తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు సబ్ స్టేషన్లలో మరమ్మత్తుల కారణంగా 11కేవీ ఎంబీఆర్ నగర్11కేవీ అక్టోపస్ ఫీడర్ల పరిధిలో ఈరోజు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగును. కాబట్టి ఎంబీఆర్ నగర్, బృందావన్ కాలనీ, కేవీ తండా, వడ్డెర బస్తీ, సాగర్ రోడ్, అక్టోపస్, ఎన్సీజీ, సిద్ధార్థ కాలేజ్, వినోబా నగర్, బీసీ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ వంటి ప్రదేశాలు కరెంటు నిలిపివెయ్యబడును. కావున కమర్షియల్,గృహ వినియోగదారులు సహకరించగలరని ఏఈ అఖిలేష్ కోరారు.

## బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని..

- మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్.



పద్మక్రాంతి, అక్టోబర్ 24, (కల్వకుర్తి ప్రతినిధి ) :

బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని మాత అని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మించిన తుల్జా భవాని ఆలయంలో తుల్జామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో వేద పారాయణం, మండప పూజ, ప్రధాన హోమాలు నిర్వహించారు. మంగళ నీరాజనాలతో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో . బోజ్య మహారాజ్, మాజీ సర్పంచులు భిక్య నాయక్,హరిచంద్ నాయక్, రాములు నాయక్, డైరెక్టర్ సేవ్య నాయక్, ఉపసర్పంచ్ పాండు నాయక్, శంకర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, శీను నాయక్, టిక్ లాల్ నాయక్, నరేష్ నాయక్, జాన్యా నాయక్, రూప్ సింగ్ నాయక్, శీను నాయక్, అంజి, రాజు, రవి, రెడ్యా, బిచ్యా, హరియా, జగన్, చందర్, నాయకులు తదితరులు ఉన్నారు.



# పటాన్‌చెరు అభివృద్ధికి నూతన ఊపిరి.

మూడు మున్సిపాలిటీలకు రూ.45 కోట్ల నిధులు

అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబాటుకు కృతజ్ఞతలు తెలిపిన కాట శ్రీనివాస్ గౌడ్

పటాన్ చేరు, అక్టోబర్ 23,(పద్మక్రాంతి):

పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల, ఇస్నాపూర్ గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు చొప్పున మెంత్తం రూ.45 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, కార్మిక, ఉపాధి, గనులు శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్. ఈ నిధులు మున్సిపాలిటీలలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య సదుపాయాలు, వీధి లైటింగ్ మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించబడతాయని ఆయన పేర్కొన్నారు. పటాన్‌చెరు పరిసర ప్రాంతాల ప్రజల ఎన్నేళ్ల అభివృద్ధి ఆశలను ఈ నిర్ణయం నెరవేర్చిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ ప్రజాహిత నిర్ణయం పటాన్‌చెరు ప్రాంతం సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుందని కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.



## తక్షణమే హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి!

యాచారం, అక్టోబర్ 24,(పద్మక్రాంతి):

మండలంలోని మాల్ వ్యవసాయ మార్కెట్ హమాలి కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య, సిఐటియు మండల కన్వీనర్ ఎస్. చందు నాయక్ హాజరై మాట్లాడుతూ..కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాలు కాలంలో ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు ముందుకు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. దశాబ్ద కాలం కార్మికుల పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్మిక వర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. మాల్ వ్యవసాయ మార్కెట్ లో హమాలీ కార్మికులకు కనీసం బాత్రూం లు లెట్ రూమ్ లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా త్రాగడానికి నీళ్లు కూడా మార్కెట్ కమిటీ పెట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తక్షణమే హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ హమాలి కార్మికులకు ప్రమాద బీమా 10 లక్షలు ప్రభుత్వం వర్తించే విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హమాలి కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, డ్రస్సులు, పండుగ సందర్భంగా బోనస్ లాంటివి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి హమాలీ కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

అనంతరం మాల్ వ్యవసాయ మార్కెట్ హమాలి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. 1. గౌరవ అధ్యక్షులుగా కాయితీ యాదగిరి రెడ్డి. 2. అధ్యక్షులుగా బట్టు సత్యనారాయణ. 3. ప్రధాన కార్యదర్శిగా రెడ్డ మోని నరసింహ. 4. ఉపాధ్యక్షులుగా రెడ్డి మౌని మహేష్, సుజాత. 5. సహాయ కారదర్శులుగా కాగు నరసింహ, అబ్బయ్య

## హెచ్‌ఐవి నియంత్రణ పై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే.

కొమరం భీమ్ ఆసిఫాబాద్, అక్టోబర్ 24,(పద్మక్రాంతి ప్రతినిధి ):



హెచ్ఐవి, ఎయిడ్స్ లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి నియంత్రణలో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, తెలంగాణ హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బైక్ ర్యాలీ అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ఆసిఫాబాద్ జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ తో కలిసి పాల్గొని కలెక్టరేట్ భవనం నుండి పట్టణంలోని బస్టాండ్ మీదగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమరం భీమ్ ఆసిఫాబాద్ ను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దామని, ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వంటి లక్షణాలు ఉంటే వీలైనంత త్వరగా పరీక్షించుకొని సత్వర వైద్య సేవలు పొందాలని, జీవిత భాగస్వామికి కూడా పరీక్షలు చేయించాలని తెలిపారు. వ్యాధిపై బాధ్యతగల పౌరుడిగా సమగ్ర అవగాహన కలిగి ఉండి పొరుగు వారికి అవగాహన కల్పించాలని, యాదిగ్రస్తుల పట్ల స్నేహభావంతో మెలిగి వారిలో ఆత్మస్థైర్యం నింపాలని తెలిపారు. వ్యాధి వ్యాప్తి నివారణకు నిరంతరం సహకరించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని ఆదరించి ఆత్మవిశ్వాసం కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా అందరిచే హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ పట్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్తి కి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం..

పద్మక్రాంతి, అక్టోబర్24, ( కల్వకుర్తి ప్రతినిధి ):



హైదరాబాద్ లోనీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్లు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు మండ్లి రాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, కాలే మల్లయ్య, తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి.

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే.



కొమరం భీమ్ ఆసిఫాబాద్, అక్టోబర్ 24,(పద్మక్రాంతి ప్రతినిధి ):

నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కొమరం భీమ్ జిల్లాలోని అసిఫాబాద్ మండలం ఆడ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇంద్రమ్మ ఇండ్లను లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలం ముగిసినందున నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని, నిర్మాణ దశలవారీగా బిల్లులు సంబంధిత లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ఉచితంగా ఇసుక అందిస్తుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇందిరమ్మ ఇండ్ల పనులను పర్యవేక్షించాలని, ప్రతిరోజు లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతిపై సమీక్షించాలని తెలిపారు. జిల్లాలో లబ్ధిదారులకు మంజూరైన ప్రతి ఇంద్రమ్మ ఇంటి పనులు మొదలు పెట్టే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిగారి హామీని లెక్కచేయని డి.టి.డి.ఓ.

కొమరం భీమ్ ఆసిఫాబాద్, అక్టోబర్ 24,(పద్మక్రాంతి ప్రతినిధి):




గిరిజన హాస్టల్స్, ఔట్సోర్సింగ్ వర్కర్ల సమ్మె 42వ రోజు సందర్భంగా గిరిజన శాఖ మంత్రి లక్ష్మణ్ తో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్ల యూనియన్ల జేఏసీ నాయకత్వంతో చర్చలు జరుపగా మంత్రి మాట్లాడుతూ మీరు చేస్తున్న సమ్మె న్యాయమైనదని,మీ న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టమైన హామీఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని సమ్మె వాయిదా వేసుకొని వెంటనే విధుల్లోకి చేరుకోవాలని ఆదేశించారు. మంత్రి హామీ మేరకు జేఏసీ నాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా చేసున్నటువంటి సమ్మె తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగింది. కానీ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మంత్రి యొక్క ఆదేశాలకు విరుద్ధంగా డిటిడిఓ మాట్లాడుతూ నా చేతిలో ఏమీ లేదని, మీరు పి.వో మేడం ని కలిసి విధుల్లోకి చేరుకోవాలని అంతవరకు విధులకు హాజరు కావద్దని స్పష్టంగా అన్నారు. దీంతో కార్మికులంతా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజన శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో రేపటి నుండి 48 గంటల నిరసన బైఠాయింపు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రేపు జరిగే నిరసన కార్యక్రమానికి కార్మికులంతా పిడికెడు పప్పు దోసెడు బియ్యం తీసుకురావాలని , జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి వర్కర్లంతా కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిర్ణయానికి పూర్తి బాధ్యత జిల్లా అధికారులే వహించాలని వెలిశాల క్రిష్ణమాచారి, రాజేందర్,లు అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన హాస్టల్స్ డైలీ వేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తొడసం వసంత్రావు, అడ శ్యామ్ రావు, కోశాధికారి మరపరాంబాయి, ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య నాయకులు శంకర్, ప్రమీల, యమునా బాయ్, జంగుబాయి,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన చెక్కు పంపిణీ



రెబ్బెన, అక్టోబర్ 24, (పద్మక్రాంతి):

గోలేటి ఎస్ బి ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో తిర్యాణి సి ఎఫ్ ఎల్ నిర్వహించినటువంటి, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన చెక్కు ను పంపిణీ చేసిన గోలేటి ఎస్బిఐ మేనేజర్ వీరస్వామి. ఇటీవల జంగంపల్లి లావణ్య భర్త ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కారణంగా మృతి చెందడంతో అతని నామిని అయిన లావణ్య కి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ. 2,00,000/- ( రెండు లక్షల రూపాయలు) విలువైన చెక్కు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ మేనేజర్ వీరస్వామి మాట్లాడుతూ.. ప్రజలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ పాలసీ వంటి ప్రమాద భీమా పథకాలను కలిగి ఉండాలని సూచించారు. సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్స్ వనజారాణి, శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ... ఈ పథకాలు సాధారణ ప్రజల ఆర్థిక రక్షణకు ఎంత ముఖ్యమో వివరించారు.

ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వీర స్వామి, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కమల్, క్యాషియర్ రాజేశం, తిర్యాణి సీఫ్ఎల్ కౌన్సిలర్లు వనజారాణి, శ్రీకాంత్ గౌడ్ అలాగే గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# బోడుప్పల్ మినీ ట్యాంక్ బండ్ గా 'రాచెరువు' అభివృద్ధి







- శరవేగంగా రాచెరువు సుందరీకరణ పనులు
- అభివృద్ధి పనులు పర్యవేక్షించిన మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు

**మేడిపల్లి,అక్టోబర్ 24,పద్మక్రాంతి:**

దశాబ్దాలుగా కెమికల్ నీటితో కొట్టుమిట్టాడుతు విషతుల్యంగా మారి ప్రజల అనారోగ్య సమస్యల నిలయంగా మారిన బోడుప్పల్లోని 'రా పరిరక్షణ కోసం, పరిశుభ్రత కోస,2015 సం లో చెరువు లోతట్టు ప్రాంతాల ప్రజలను ఏకం చేసి స్వచ్ఛంద సంస్థలు, వివిధ పార్టీల నాయకులతో కలిసి రా చెరువు పరిరక్షణ సమితిని ఏర్పాటు చేసి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు చెరువు దుర్భర పరిస్థితిని వివరించి రా చెరువు అభివృద్ధి కోసం ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న కృషి ఫలితంగా పరిశ్రమల నుండి కెమికల్ నీరు చెర-ువులోకి రాకుండా దాని అభివృద్ధికి కృషి చేయాలని ముందుకు వచ్చిన మున్సిపల్ కమిషనర్, అధికారులు, యువ నాయకుడు మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్, ప్రత్యేక చొరవతో, పాలక మండలి సభ్యులు, మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ కృషితో మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ యాదవ్ కృషితో హెచ్ఎండిఏ ప్రత్యేక నిధులతో రాచెరువు సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు, మాజీ మేయర్, నాయకులు రా చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. రాచెరువును బోడుప్పల్ మినీ ట్యాంక్ బాండ్ గా అభివృద్ధి చేస్తూ, ఓపెన్ జిమ్ నిర్మాణం, కట్ట కింది భాగంలో ఒక రోడ్డు, కట్ట వద్ద బతుకమ్మ, వినాయక నిమజ్జనం, తీజ్ పండుగల కోసం చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహా రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్, మాజీ కార్పొరేటర్లు రాసాల వెంకటేష్ యాదవ్, సుమన్ నాయక్, బొమ్మక్ కళ్యాణ్ కుమార్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, పులకండ్ల జంగారెడ్డి, పద్మ రావు, చీరాల నర్సింహ, రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు, ఇతర నాయకులు, మల్లయ్య నగర్, అను శ్రీ నగర్, తిరుమల మెడోస్, రెడ్డి కాలనీ గాయత్రి హిల్స్, సప్తగిరి హిల్స్, దేవేందర్ నగర్, అంబేద్కర్ నగర్ వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సుమారు 200 కోట్లకు పైగా ఎమ్మెల్యే అక్రమాస్తులు.

- ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యపై ఏసీబీకి ఫిర్యాదు చేసిన బొడుసు మహేష్
- అక్రమాస్తులపై విచారణ చేయాలని డిమాండ్

**హైదరాబాద్ బ్యూరో, అక్టోబరు 24 (పద్మక్రాంతి):**

ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య అనతికాలంలోనే 200 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ గురువారం సామాజిక కార్యకర్త బొడుసు మహేష్ హైదరాబాద్ ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్) కు యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కు సంబంధించిన వివరాలను పిటీషనర్ బొడుసు మహేష్ విలేఖరులకు వెల్లడించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఎలక్షన్ కమీషన్ కు బీర్ల అయిలయ్య సమర్పించిన అఫిడవిట్‌లో తనకు నలభై మూడు ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్నాడని, కానీ అతని పేరు, భార్య బీర్ల అనిత పేరున ఉన్న వివిధ రకాల ఆస్తులను వెల్లడించలేదని అప్పట్లోనే ఎన్నికల కేసును వేశామని తెలిపారు. అంతేకాకుండా ఎంఎల్ఏగా గెలుపొందిన తర్వాత బీర్ల అయిలయ్య తన అనుయా-యులైన ధనావత్ శంకర్ నాయక్, చాడ భాస్కర్ రెడ్డి, భూక్య రాజారాం, చీర శ్రీశైలం, శిక ఉపేందర్ మరికొందరిని బినామీలుగా మార్చుకొని సుమారు 100 ఎకరాల భూమి మేర అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపించారు. ఈ ఆస్తుల విలువ ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో రెండు వందల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని తెలిపారు.ఇంత పరిమిత కాలంలో స-ుమారు 200 కోట్ల పైబడిన ఆస్తులను ఎలా సంపాదించారో, భారత ప్రజాస్వామ్య దేశంలో ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. అక్రమాస్తులకు సంబంధించిన అన్ని ఆధారాలను ఏసీబీ, ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమర్పించానని, పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య (ఫైల్)



ఏసీబీ, ఇన్కమ్ టాక్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన బొడుసు మహేష్

# శ్రీ తుల్జా భవానీ మాత అను గ్రహం తండా ప్రజలపై ఎల్లపుడు ఉండాలి..

- దేవాలయ అభివృద్ధికి 3,లక్షలతో సహకారం
- విగ్రహా ప్రతిష్టాపనలో పాల్గొన్న సింగిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**పద్మక్రాంతి, అక్టోబర్ 24, ( కల్వకుర్తి ప్రతినిధి):**



కడ్తాల్ మండలం,కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీ తుల్జాభవానీ మాతాదేవాలయంలోఅమ్మవారి విగ్రహా ప్రతిష్టాపన మహెూత్సవ కార్యక్రమానికి హాజరైన.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
పూజా కార్యక్రమంలో పాల్గొని,అమ్మవారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ. దేవాలయాలు మనలో ఆధ్యాత్మికతను పెంపొందించి, శాంతిని అందించే గొప్ప నిలయాలు అని,ఆలయాల అభివృద్ధికి అందరం సహకారం అందించాలని,మన సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తూ, భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందని తెలుపుతూ, కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న తుల్జాభవాని మాతా దేవాలయ అభివృద్ధికి తండా వాసుల,స్థానిక నాయకుల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి రూ.3 లక్ష రూపాయలు సహకారం అందించారు, మొదటి విడతగా ఆలయ నిర్మాణానికి 1. ఒక లక్ష చెక్ రూపకంగా అందించడంతో పాటు రెండో విడతగా ఆలయానికి రూ.2.రెండు లక్షల రూపాయల తో పెయింటింగ్ పనులు పూర్తి చేయడం జరిగిందని,ఆలయ అభివృద్ధిలో తనను భాగస్వామ్యం చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ,దేవాలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.మా తండా లో తుల్జా భవానీ మాత దేవాలయ నిర్మాణానికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి అడిగిన వెంటనే స్పందించి ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల సహకారం అందించారని, ఇంత త్వరగా పెద్ద మొత్తంలో తోడ్పాటును అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ఎల్లపుడు రుణపడి ఉంటామని,వారికి భవిష్యత్ లో కూడా తోడుగా నడుస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భిక్య నాయక్,మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, ఆలయ కమిటీ సభ్యులు బిచ్య నాయక్, నర్సింగ్,లక్ష్మణ్,నరేష్,జన్య, రాజు దేవుల మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఉన్నారు.

# ఖాళీగా ఉన్న ఎస్సీ సేవా సంఘం దుకాణ సముదాయాలకు దరఖాస్తులు చేసుకోవాలి.

## ఎస్సీలకు చెందిన నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి పొందాలి.

## నవంబర్ 15 లోపు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో దరఖాస్తులు చేసుకోవాలి.

**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 24, (పద్మక్రాంతి ప్రతినిధి):**

రంగారెడ్డి జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం మహేశ్వరం, యాచారం మండలాల తో పాటు, శంషాబాద్, సాహెబ్ నగర్ మున్సిపాలిటీలలో నిర్మించిన దుకాణా సముదాయములలో ఖాళీగా ఉన్న దుకాణములను షెడ్యూల్ కులముల వారికి నెలవారి అద్దె క్రింద కేటాయించుటకు సంబంధిత అధికారులు నిర్ణయించారు. సదరు దుకాణమును నెలసరి అద్దె ప్రతిపాదికన కేటాయింపు పొందుటకు ఎస్సీలకు చెందిన నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి వ్యాపారము నిర్వహించుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.
ఖాళీగా ఉన్న దుకాణాలలో మహేశ్వరం మండల కేంద్రంలో 1, యాచారం గ్రామ పంచాయతీ భవనం దగ్గర లోని మెయిన్ రోడ్ వద్ద 5, శంషాబాద్ మున్సిపల్ లోని అంగన్ వాడి స్కూలు వద్ద 5, సాహెబ్ నగర్ లోని వైదేహి నగర్ బస్ స్టాప్ దగ్గర 3, విజయపురి కాలనీ, ఎల్బీనగర్ లో ఖాళీగా ఉన్నాయి. అధికారులు సూచించిన నియమ నిబంధనలను పాటించి నిర్ణీత ఫారం లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.
దరఖాస్తుదారు సంబంధిత మండల, మున్సిపాలిటీ పరిధిలో ఉండాలి. దరఖాస్తుదారు షెడ్యూల్ కులమునకు చెందిన వారై 18 సం. నుండి 35 వయస్సు లోపు వారు ఉండాలి. దరఖాస్తుదారునికి తెల్ల రేషన్ కార్డును కలిగి ఉండాలి. కనీసం, 5వ తరగతి, ఆ పైన చదివిన వారు ఏదేని స్వయం ఉపాధి పథకం స్వంతముగా ఏర్పాటు చేయగలిగే సామర్థ్యము కలిగి ఉండాలి. మహిళలకు, వితంతువులకు, అత్యాచార బాధితులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. దుకాణాలకు నెలసరి అద్దె, అభ్యర్థుల ఎంపికలో జిల్లా ఎంపిక కమిటీది తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు.




దరఖాస్తుదారులు
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం, 2వ అంతస్తులోని రూం నెం. 59 లో నవంబర్ 15 లోపు సాయంత్రం 5.00 గంటలలోగా చేరునట్లు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఉప్పల చారి ట్రబుల్ ద్వారా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం..



**పద్మక్రాంతి, అక్టోబర్ 24, ( కల్వకుర్తి ప్రతినిధి ):**

వెల్దండ మండలం లోని తిమ్మినోని పల్లి గ్రామానికి చెందిన పోడేండ్ల అనూష అనారోగ్య సమస్యతో బాధపడుతూ చనిపోవడం జరిగింది స్థానిక బీఅర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మిషన్ భగీరథ రాష్ట మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3.వేల రూ-పాయలు అందజేశారు.మరియు మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య 2.వేల రూపాయలు టిఆర్ఎస్ యువ నాయకులు గండికోట రాజు 2.వేల రూపాయలు మొత్తం 7.వేల రూపాయలు మృతురాలి కుటుంబానికి అందజేయడం జరిగింది. కార్యక్రమంలో,మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య,యువ నాయకుడు గండికోట రాజు, బిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు ఉన్నారు.

# చురుకుగా చెంగిచెర్ల హనుమాన్ వాడ పబ్లిక్ పార్క్ అభివృద్ధి పనులు

**పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్**



**మేడిపల్లి, అక్టోబర్ 24, పద్మక్రాంతి:**



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలోని చెంగిచెర్ల ఓల్డ్ విలేజ్ హనుమాన్ వాడలో 700 గజాల పార్క్ స్థలం చుట్టూ హెచ్ఎండిఏ నిధులతో ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ పర్యవేక్షించారు.
నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, త్వరితగతిన పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్కు ఆదేశించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా ప్రతి రోడ్డుకు గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

# సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన రెబ్బెన ఎస్ ఐ వెంకటకృష్ణ




**రెబ్బెన, అక్టోబర్ 24, (పద్మక్రాంతి):**

కుటుంబ కలహాలతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన వ్యక్తి ప్రాణాలను సకాలంలో స్పందించి కాపాడిన రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ. వివరాల్లోకి వెళ్తే... రాజురాకు చెందిన కురాట్ కార్ శ్యామ్ రావు అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 11 గంటలకు కుటుంబ కలహాలతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రెబ్బెన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ వద్దకు వచ్చి తన బైక్ ని ఇక్కడ పార్క్ చేసి ఆత్మహత్య చేసుకున్నందుకు ట్రాక్ వెంట రేపల్లెవాడ రైల్వే స్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్ళాడు. దాంతో అతని కుటుంబ సభ్యులు విషయాన్ని రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ కి తెలియజేయగా వెంటనే స్పందించిన ఎస్ ఐ శ్యామ్ రావు ఆచూకిని తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అతని లొకేషన్ ను ట్రేస్ చేసి మంచిర్యాల జిల్లా ఐబి తాండూర్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే కానిస్టేబుల్ దుర్గేంద్రతో కలిసి అక్కడికి వెళ్లి శ్యామ్ రావు ఆత్మహత్య చేసుకోకుండా అతని ప్రాణాలను కాపాడి స్టేషన్ కు తీసుకువచ్చారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... క్షణికావేశంలో అనాలోచిత నిర్ణయాలు చేసుకుంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలే తప్ప ఆత్మ హత్య ల వంటి వాటి జోలికి వెళ్లొద్దని కోరారు.

# చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపులు

**హైదరాబాద్,అక్టోబర్24(పద్మక్రాంతి ):**

చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా 3,610 మంది చిన్న కాంట్రాక్టర్లకు రూ.94.77 కోట్ల బిల్లులు చెల్లించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ఈ సందర్భంగా చిన్న కాంట్రాక్టర్లంతా ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. బిల్లుల చెల్లింపుతో ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు తెలిపారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

## పోచారంలో ప్రహరీగోడ తొలగింపు

- హైడ్రా చర్యలతో స్థానికుల ఆనందం

హైదరాబాద్,అక్టోబర్24(పద్మక్రాంతి ):








ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. చెరువులు, కుంటలకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి పునరుద్ధరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పోచారంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా తొలగించి 8 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించింది. 1978లో 27 ఎకరాల ఎకరాల్లో 400 ప్లాట్లతో జీపీ లే అవుట్ ఏర్పాటు చేయగా.. అందులో ఓ వ్యక్తి 6.18 ఎకరాల భూమిని తమదే అంటూ అక్రమంగా ప్రహరీ నిర్మించాడు. అక్రమ ప్రహరీపై సుమారు 8 ఏళ్లుగా పోరాడిన లే అవుట్ సొసైటీ.. చివరకు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేసింది. సొసైటీ సభ్యుల ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు.దీంతో ప్రహరీ గోడను తొలగించారు హైడ్రా సిబ్బంది. 8 ఏళ్లుగా ఉన్న సమస్యకు హైడ్రాతో పరిష్కారం లభించడంతో హైడ్రా చర్యల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు.

## తెలంగాణ ప్రభుత్వం
# మరో కీలక నిర్ణయం

**ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా అదనపు కలెక్టర్లు**



హైదరాబాద్,అక్టోబర్24(పద్మక్రాంతి ):

తెలంగాణ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లని ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లు గా నియమిస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్ పదవి రద్దు చేసి.. కొత్త బాధ్యతలని అదనపు కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో అడవి భూసర్వే, హక్కుల నిర్ధారణ, సెటిల్‌మెంట్ పనులు వీరి పరిధిలోకి రానున్నాయి. 1967 ఫారెస్ట్ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గద్వాల కలెక్టర్, ఎస్పీ







కర్నూలు, జిల్లా:- అక్టోబర్ 24(పద్మక్రాంతి )

కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద చోటుచేసు కున్న ఘోర బస్సు ప్రమాదంపై తెలంగాణ జోగులాంబ గద్వాల జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించింది. స్వయంగా ఘటన స్థలానికి వెళ్లిన కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కర్నూలు జిల్లా అధికారులతో మాట్లాడారు. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం, మృతి చెందినవారి మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయా లను అందించేందుకు రెండు జిల్లాల యంత్రాంగాలు కలిసి పనిచేస్తు న్నాయి. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, డ్రైవర్, ఆపరేటర్ నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలను సీజ్ చేసే విషయంలో
# అధికారులు వెనక్కి తగ్గడానికి కారణం...?





- రాజకీయ కోణమా లోపాయికారి ఒప్పందమా...?.
- చిన్నారి విద్యార్థుల ప్రాణాలు అంటే లెక్క లేదా!
- ఎవరి లాభాల కోసం ఈ కాలయాపన

ఇబ్రహీంపట్నం ప్రతినిధి, అక్టోబర్ 24,(పద్మక్రాంతి):

శ్రీ చైతన్య పాఠశాలలను సీజ్ చేసే విషయంలో విద్యాశాఖ అధికారులు వెనక్కి తగ్గారు. దీనికి కారణం ఏమిటని స్థానిక ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో శ్రీ చైతన్య పాఠశాలను పెట్రోల్ బంక్ పక్కనే ఉన్నందున వెంటనే కాళీ చేయాలని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ జీవో ఎం.ఎస్. నెంబర్ 145/1997-98 ఆక్ట్ ప్రకారం ఫైర్ ఎన్.ఓ.సి లేకుండా నడుపుతున్న పాఠశాలకు అనుకోని అగ్ని ప్రమాదం జరిగితే వందలాది మంది చిన్నారి విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసే అవకాశం ఉందని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పాఠశాలను వెంటనే ఖాళీ చేయాలని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు మాత్రం శ్రీ చైతన్య పాఠశాల పై చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది రాజకీయ కోణమా లేక లోపాయికారి ఒప్పందమా అని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో ధనార్జినే ధ్యేయంగా పాఠశాలను నడుపుతూ దాదాపు 1500 మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు మాత్రం అనేక ఫిర్యాదులు వచ్చిన ఏమాత్రం తమకు పట్టనట్లుగా ప్రైవేటు పాఠశాలలకు తాము వత్తాసుగా పనిచేస్తున్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప ప్రభుత్వ అధికారుల పనితీరులో చలనం రాదా..! ప్రమాదం జరిగిన తర్వాత ఆగమేఘాలపై "చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు" వ్యవహరిస్తే లాభం ఏమిటి...? ఎవరి లాభం కోసం ఈ కాలయాపన అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి!

**విద్యా,విజ్ఞానం నా లక్ష్యం...**

**సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తా**

**యువత ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంలో కృషి చేస్తా!**



యాచారం, అక్టోబర్ 24,(పద్మక్రాంతి):



నంది వనపర్తి గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వండి అంటూ గోరటి వెంకటేశం గ్రామ ప్రజలను కోరారు.రాజ్యాంగపరంగా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని గ్రామ అభివృద్ధి లో పాలుపంచుకోవడానికి స్థానిక ఎన్నిక బరిలో నిల్చోవడానికి సిద్ధంగా ఉన్నట్లు నంది వనపర్తి గ్రామ నివాసి గోరటి వెంకటేశం తెలిపారు.మండల కేంద్రం లో శుక్రవారం విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ లో భాగంగా నంది వనపర్తి సర్పంచ్ రిజర్వేషన్ ఎస్సీ రావడంతో ఎన్నికల బరిలో నిల్చోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తనకు సర్పంచ్ గా అవకాశం ఇస్తే గ్రామంలో ప్రాథమిక విద్య చదువుతున్న విద్యార్థుల నుంచే చదువుపై ఆసక్తి పెరిగేలా, నైపుణ్యాన్ని పెంచుకునే విధంగాకంప్యూటర్ విద్యను ప్రోత్సహిస్తానని తెలిపారు. గ్రామంలోవున్న ప్రతి కమ్యూనిటీ భవనాల్లో కంప్యూటర్లు అందించి, గ్రామంలో ఉండే విద్యావంతులైన వారిచే విద్యార్థులచే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందిస్తామని, శిక్షణ ఇచ్చిన విద్యావంతులైన గ్రామస్తులకు వేతనాలు అందించే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులు, యువతలో ఉన్న టాలెంట్ ను వెలికి తీసి ప్రతి ఒక్క కళ కు రూపుదిద్దేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యార్థులకు సాయంత్రం ట్యూషన్, గ్రామ లైబ్రరీ, క్రీడా సామాగ్రితో సమకూరిన అవుట్డోర్, ఇండోర్ ఆటలను ఆడిస్తూ, టోర్నమెంట్లు నిర్వహించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీస్తానని తెలిపారు.చదువుతో, విజ్ఞానంతో ఎన్నో విజయాలు సాధించవచ్చు అన్నారు.అన్ని రంగాల్లో గ్రామాన్నిముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పని చేస్తానని గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించాలని గోరటి వెంకటేశం కోరారు

## పాముకాటుకు గురై డిగ్రీ విద్యార్థి మృతి

- కేసు నమోదు చేసిన పోలీసులు

పెద్దపల్లి,అక్టోబర్24(పద్మక్రాంతి):



దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన డిగ్రీ విద్యార్థిని పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోరూపు నారాయణపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రం అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థినికి శుక్రవారం పాముకాటుకు గురై మృత్యువాత పడింది. అక్షిత సుల్తానాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతోంది. దీపావళి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. శుక్రవారం కాలేజీకి పోతా అంటే తల్లి శుక్రవారం రోజు ఎందుకు వద్దు అనడంతో ఇంటి వద్దనే ఉండిపోయింది. తండ్రి శ్రీనివాస్ దివ్యాంగుడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో తల్లి కోమల కూలీ చేస్తేనే కుటుంబ పోషణ సాగుతుంది. దీంతో బిడ్డను ఇంటి వద్ద ఉంచి తల్లి పత్తి పంటను ఏరెందుకు కూలికి వెళ్ళింది. ఇంటి వద్ద అక్షిత కుర్చీలో కూర్చొని హోంవర్క్ చేసుకుంటుండగా పాము కాలుకు కాటు వేసింది. దీంతో వెంటనే తేరుకుని తనను ఏదో కుట్టిందని అరవడంతో ఇంటి పరిసర ప్రాంత ప్రజలు పరిగెత్తుకు వచ్చి చూడగా కుర్చీ కింద పాము ఉన్నట్లు గుర్తించారు. పామును కొడదామని లోపే అక్కడి నుంచి పారిపోయింది. విషయం తల్లికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో ఇంటికి వచ్చి అక్షితను మొదటగా తీసుకువెళ్లి అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. డిగ్రీ విద్యార్థి పాముకాటుతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదం నింపింది. తల్లి, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. శ్రీనివాస్ గౌడ్, కోమల దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా అక్షిత పెద్దది. ఈ మేరకు పోత్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కర్నూలు జిల్లా బస్సు దుర్ఘటన

- కావేరీ యాజమాన్యంతో పాటు డ్రైవర్‌పై కేసు

కర్నూలు,అక్టోబర్24(పద్మక్రాంతి):



కర్నూలు జిల్లా బస్సు దహన ఘటనకు సంబంధించి కావేరీ ట్రావెల్స్ బస్సు యాజమాన్యం, డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్యలపై కర్నూలు జిల్లా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ బస్సులో ప్రయాణించిన ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు పెట్టారు. ఇప్పటికే ఆ బస్సుకి చెందిన ఒక డ్రైవర్ శివ నారాయణ పోలీసుల అదుపులో ఉన్నారు. అయితే, పరారీలో మరో డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య ఉన్నారు. ముత్యాల లక్ష్మయ్యపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. బస్సు ప్రమాదంలో 19 మంది ప్రయాణికుల మృతికి కారణమయ్యారని కావేరి బస్సు యాజమాన్యం, డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్యలపై పోలీసులు కేసులు పెట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా డీఐజీ కోయ ప్రవీణ్ సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. బస్సు ప్రమాద ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు చిన్నటేకూరు వద్ద మంటల్లో కాలిపోయింది. బైక్ ఢీకొనడంతో మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో 19 మంది ప్రయాణికులు, ఒక బైకర్ మృతిచెందారు. ఈ ప్రమాదంలో మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులకి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులు అటాచ్ చేసిన ఇడి

హైదరాబాద్,అక్టోబర్24(పద్మక్రాంతి ):

హైదరాబాద్‌లోని సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ జప్తు చేసింది. రూ.12.65 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన చేసింది. ఫ్రీలాంచ్ ఆఫర్ పేరుతో సాహితీ ఇన్‌ఫ్రా మోసం చేసినట్లు గుర్తించిన అధికారులు.. కంపెనీ డైరెక్టర్ పూర్ణచందర్‌రావుతో పాటు కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ సంస్థ ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో బాధితుల నుంచి రూ.842 కోట్లు వసూలు చేసినట్టు అధికారుల దర్యాప్తులో తేలింది. రెరా, హెచ్‌ఎండీఏ నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినట్టు వెల్లడయింది. రూ.216.91 కోట్లు నగదు లెక్కల్లో చూపలేదని అధికారులు తెలిపారు. కష్టమర్ల నుంచి వసూలు చేసిన డబ్బుతో.. కంపెనీ డైరెక్టర్లు స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది. ఇప్పటివరకు ఈడీ161.50 కోట్ల ఆస్తులు సీజ్ చేసింది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుందని.. లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు జైలులో ఉన్నారని అధికారులు వివరించారు.



RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# ఫంగల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారా?



అందరికీ ఏదో ఒక సమయంలో చర్మ సమస్యలు వస్తాయి. అయితే, వర్షాకాలంలో చర్మంపై ఫంగల్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఎందుకంటే ఈ సీజన్‌లో తేమ కారణంగా.. బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందుతుంది. ఫంగల్ ఇన్ఫెక్షన్ వస్తే.. దురద, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలు చాలా ఇబ్బందిని కలిగిస్తాయి. దీన్ని నివారించడానికి హోం రెమెడీస్ తెలుసుకుందాం. టీ ట్రీ ఆయిల్ యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనాన్ని అందించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. ప్రభావిత ప్రాంతంలో దీనిని క్రమం తప్పకుండా అప్లై చేయాలి. మంచి ఫలితాలు వస్తాయి. ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల ఇబ్బంది పడుతుంటే, ఈ సమయంలో పెరుగు తీసుకోవడం మంచిది. పెరుగు మంచి బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. ఫంగల్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. సాధారణ పెరుగు మాత్రమే తినాలి.. చక్కెర, ఉప్పు వంటివి జోడించవద్దు. భారతీయ వంటగదిలో వెల్లుల్లి సులభంగా దొరుకుతుంది. మీరు ఫంగల్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవటానికి దీనిని ఉపయోగించవచ్చు. ఇది యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంది. వెల్లుల్లిని బాగా చూర్ణం చేసి, ప్రభావితమైన చర్మంపై అప్లై చేయండి. వేప అనేక ఔషధ లక్షణాలతో నిండి ఉంటుంది. దీని ఆకులను నీటిలో వేసి మరిగించి రోజూ స్నానం చేస్తే ఎలాంటి చర్మ సమస్యలు రావు. వేప బెరడును గ్రైండ్ చేసి, ప్రభావిత ప్రాంతంలో పూయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఆకుల పేస్ట్ కూడా అప్లై చేయవచ్చు. ఫంగల్ ఇన్ఫెక్షన్ నుంచి బయటపడటానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించవచ్చు. ఉదాహరణకు, అథ్లెట్స్ ఫుట్ ఇన్ఫెక్షన్, స్కిన్ ఇన్ఫెక్షన్ మొదలైనవాటిని తగ్గించడానికి, ఆపిల్ సైడర్ వెనిగర్‌ను బాగా పనిచేస్తుంది. దాన్ని నీటిలో కలిపి ప్రభావిత ప్రాంతంలో రాసుకుంటే మంచి ఫలితాలు పొందుతారు.

# పండ్లను తిన్న తర్వాత నీరు తాగుతున్నారా..



నీరు లేకుండా జీవితం సాధ్యం కాదు. అదేవిధంగా పండ్ల వినియోగం మానవ ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. అయితే, ఈ రెండింటికి సంబంధించి ఒక చిన్న పొరపాటు మీకు హాని చేస్తుందని మీకు తెలుసా..? అవును, కొన్ని పండ్లు తిన్న తర్వాత నీరు త్రాగడం జీర్ణవ్యవస్థకు హాని కలిగిస్తుంది. మరి అవేంటో.. అలాంటి కొన్ని పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఎక్కువగా తినే పండ్లలో అరటిపండు ఒకటి. తరచుగా మనం అరటిపండు తిన్న తర్వాత నీరు తాగుతాము. అయితే, మనం అలా చేయకూడదు. ముఖ్యంగా అరటిపండు తిన్న తర్వాత మీరు చల్లని నీరు త్రాగకూడదు. నీరు జీర్ణవ్యవస్థకు అరటిపండ్లను జీర్ణం చేయడం కష్టతరం చేస్తుంది. ఇది గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. దీనిని నివారించడానికి అరటిపండు తిన్న 15 -20 నిమిషాల తర్వాత నీరు త్రాగాలి. బొప్పాయి జీర్ణవ్యవస్థకు మంచిది. అలాగే దాని వినియోగం ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మీరు బొప్పాయి తిన్న వెంటనే నీరు త్రాగితే అది ప్రయోజనాలకు బదులుగా హాని కలిగించవచ్చు. దీని వల్ల జీర్ణక్రియ సరిగా జరగదు. అంతేకాదు మీకు డయేరియా వంటి సమస్యలు కలగవచ్చు. ఇలా చేయడం వల్ల కడుపు లోపలి పొర కూడా దెబ్బతింటుంది. దీని కారణంగా మీరు వికారంగా ఉండడం.. అలాగే విశ్రాంతి తీసుకోలేరు. జామపండు తిన్న వెంటనే నీరు త్రాగకూడదు. నిజానికి జామపండు తిన్న తర్వాత నీరు త్రాగడం వల్ల జీర్ణవ్యవస్థ pH స్థాయి మరింత దిగజారుతుంది. అంతేకాకుండా యాసిడ్ పెరుగుతుంది. దీనివల్ల ఎసిడిటీ సమస్య వస్తుంది. మీరు దీన్ని నివారించాలనుకుంటే జామ తిన్న 35 నుండి 40 నిమిషాల తర్వాత మాత్రమే నీరు త్రాగాలి. పుచ్చకాయ తిన్న తర్వాత కూడా నీళ్లు తాగకూడదు. పుచ్చకాయలో ముందే చాలా నీరు ఉంటుంది. కాబట్టి మీరు దీని తర్వాత నీటిని తాగితే అది కడుపులో వాపు లేదా భారాన్ని కలిగిస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయలో షుగర్, ఫైబర్ కూడా ఉంటాయి. తిన్న తర్వాత నీటిని తాగితే బ్యాక్టీరియా నేరుగా కడుపులోకి చేరుతుంది. ఇది జీర్ణ సమస్యలను కలిగిస్తుంది.

# ఎండుద్రాక్షను నీళ్లలో మరిగించి తింటే



ఎండుద్రాక్షలో ఐరన్, పొటాషియం, కాల్షియం, ఫైబర్, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, ఎండు ద్రాక్షతో మరిగించిన నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఎండుద్రాక్ష విటమిన్లు, ఖనిజాల మూలం. ఎండుద్రాక్షలో ఐరన్, పొటాషియం, కాల్షియం, ఫైబర్, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. కాబట్టి ఎండు ద్రాక్షతో మరిగించిన నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఎండుద్రాక్ష నీరు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను చూద్దాం. ఫైబర్ పుష్కలంగా ఉండే ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం పొందవచ్చు, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కాలేయం నుండి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. ఎండుద్రాక్ష నీరు తాగడం వల్ల కాలేయం నుండి టాక్సిన్స్ బయటకు వెళ్లడం కూడా మంచిది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఎండుద్రాక్షతో మరిగించిన నీరు ఐరన్‌కు మంచి మూలం. కాబట్టి, రక్తహీనత రాకుండా ఉండాలంటే ఎండుద్రాక్ష నీరు తాగడం మంచిది. ఎండుద్రాక్ష మరిగించిన నీటిని తాగటం వల్ల రోగనిరోధక శక్తి లభిస్తుంది. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎండుద్రాక్షలోని పీచు ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. ఎండుద్రాక్ష కూడా పొటాషియం మంచి మూలం. కాబట్టి ఎండుద్రాక్ష నీరు తాగడం రక్తపోటును తగ్గించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి మంచిది. ఎండుద్రాక్ష నీటిని తాగటం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. క్యాల్షియం పుష్కలంగా ఉండే ఎండుద్రాక్ష ఎముకల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఎండు ద్రాక్షతో మరిగించిన నీటిని తాగడం వల్ల అనవసర కొవ్వు బయటకు పోతుంది.

# తామర గింజలు ఇలా రోజూ తింటే..



ఫూల్ మఖానా దీనినే లోటస్ సీడ్స్ గురించి చాలా మందికి తెలియదు. వీటిని వేయించి పాప్ కార్న్ లాగా తింటారు. ఈ ఆసక్తికరమైన విత్తనాలు పురుషుల సంతానోత్పత్తిని పెంచడం నుండి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. లోటస్ గింజలు పోషకాల పవర్‌హౌస్. వాటిలో కొలెస్ట్రాల్, సోడియం తక్కువగా ఉంటాయి. మూత్రపిండాల సమస్యలు, దీర్ఘకాలిక విరేచనాలు, అధిక ల్యుకోరోయా వంటి వివిధ వ్యాధుల చికిత్సకు ఇది చాలా సంవత్సరాలుగా ఉపయోగించబడుతోంది. మఖానాలో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది ఆహార కోరికలను తగ్గిస్తుంది. మీ ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. పురుషులలో సంతానోత్పత్తిని పెంచుతుంది. ఈ విత్తనాలు వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. పురుషులలో సంతానోత్పత్తిని పెంచుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. మఖానాలో యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, టైప్ 2 డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఎముకలను బలపరుస్తుంది. మఖానాలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముక, మృదులాస్థి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది. ఈ విత్తనాలు చర్మం ముడతలు, జుట్టు రాలడం, వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. నెయ్యిలో వేయించిన తామర గింజలు అద్భుతమైన, ఆరోగ్యకరమైన స్నాక్‌గా పనిచేస్తుంది. ఇందులోని తక్కువ కొవ్వు, అధిక ప్రోటీన్ కంటెంట్ బరువు తగ్గాలనుకునేవారికి మేలు చేస్తుంది. మఖానాను నెయ్యిలో వేయించడం వల్ల వెన్నతో కూడిన రుచి వస్తుంది.

## నాణ్యమైన ఆహారం అందరి బాధ్యత



ప్రపంచవ్యాప్తంగా కల్తీ ఆహారం తిన్న కారణంగా రోజుకు దాదాపు లక్షలాది మంది జబ్బు పడుతున్నారట. ప్రపంచ ఆరోగ్య సంస్థ జూన్ 7న 'ప్రపంచ ఆహార భద్రత దినం' సందర్భంగా పేర్కొన్న ఈ విషయం ఆందోళన కలిగించే అంశం. ఇక కల్తీ ఆహారం కాటుకు గురయ్యేవారిలో నలభై శాతం వరకు ఐదేండ్ల లోపు చిన్నారులే ఉంటున్నారు. ఆహారం నాణ్యత పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతున్నది.

కాగా, కల్తీ ఆహారం కారణంగా జరుగుతున్న ఆర్థిక నష్టమైతే పదకొండు వేల కోట్ల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. ఇది కూడా ప్రధానంగా అల్ప, మధ్యాదాయ దేశాల్లో ఉండటం గమనార్హం. ఇది ఉత్పాదకత మీదనే కాకుండా ఆరోగ్య వ్యవస్థల మీద కూడా తీవ్రమైన దుష్ప్రభావం చూపుతుంది. కల్తీ ఆహారం కారణంగా ప్రతి ఏటా సుమారు పదిహేను కోట్ల మంది జబ్బు పడుతుంటే, 1,75,000 మంది మరణిస్తున్నారని అంచనా. ఇక ఆహార కల్తీకి కారణాలు ఎన్నో! ముఖ్యంగా వేడి వాతావరణంలో చీడపీడల బాధ ఎక్కువగా ఉంటుంది. ఇది ఆహార పదార్థాలపై సహజంగానే టాక్సిన్లు ఏర్పడటానికి దారితీస్తుంది. పైగా వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్యమైన మార్పులు కూడా ఆహార కల్తీకి కారణమవుతున్నాయి. కాబట్టి, "ఆహార భద్రత అనేది ప్రభుత్వాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారుల ఉమ్మడి బాధ్యత.

తినే తిండి నాణ్యత విషయంలో అందరికీ పాత్ర ఉంటుంది" అంటారు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రాంతీయ విభాగం డైరెక్టర్ సయీమా వాజెద్. అందరూ భద్రతా చర్యలు తీసుకుంటేనే ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన పోషకాహారం అందుబాటులో ఉంటుంది.

# పెసరపప్పుతో ఇన్ని లాభాలున్నాయా?



పెసర పప్పులో ప్రోటీన్స్, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఎక్కువ సమయం పాటు కడుపు నిండిన భావాన్ని కలిగిస్తుంది. అంతేకాకుండా ఆకలి కూడా నియంత్రణలో ఉంటుంది. దీని కారణంగా సులభంగా బరువు తగ్గుతారని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది.

అంతేకాకుండా ఇందులో లభించే ఫైబర్ పొట్టను ఆరోగ్యంగా చేస్తుంది. పెసర పప్పులో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. పెసరపప్పు గుండె ఆరోగ్యానికి బాగా పని చేస్తుంది. పెసర పప్పులో ఫైబర్, పొటాషియం అధికంగా ఉంటుంది. ఇవి రక్తపోటును నియంత్రించడానికి, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి ఎంతగానో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఇవి రెండూ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పెసరపప్పులో క్యాన్సర్‌ను ఎదుర్కొనే గుణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పెసరపప్పును క్రమం తప్పకుండా తీసుకోవటం వల్ల చర్మం నిగారించేలా చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగపడుతుంది. ఇన్‌ఫెక్షన్స్ దరి చేరకుండా చేయడమే కాకుండా అనేక వ్యాధుల నుంచి రక్షిస్తుంది. పర్యావరణ కాలుష్యం వల్ల వచ్చే సమస్యలను కూడా దూరం చేస్తుంది. పెసర పప్పులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి మధుమేహంతో బాధపడేవారు ప్రతి రోజు పెసరపప్పును తినడం వల్ల రక్తంలోని చక్కెర పరిమాణాలు నియంత్రణలో ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడంలో సహాయపడుతుంది. ఈ పప్పును క్రమం తప్పకుండా తినడం వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. దీంతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులు కూడా సులభంగా దూరమవుతాయి. పెసర పప్పులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.. ఇవి చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుంచి మన శరీరాన్ని, చర్మాన్ని రక్షిస్తుంది. దీని కారణంగా ముడతలతో పాటు ఆయిల్ స్కిన్ సమస్యలు కూడా దూరమవుతాయి.

## చెమట వాసనా?

చంకల్లో ఎక్కువగా చెమట పట్టడాన్ని హైపర్ హైడ్రోసిస్ అంటారు. ఇబ్బంది కలిగించే ఈ సమస్య అందరిలోనూ తలెత్తుతుంది. అతిగా చెమట పట్టడం వల్ల బట్టల మీద మరకలు, దుర్వాసన, తరచుగా బట్టలు మార్చుకోవడం మొదలైన ఇబ్బందులు తలెత్తుతాయి. అంతేకాదు ఈ సమస్య మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. హైపర్‌హైడ్రోసిస్‌కు కొన్ని చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులను సంప్రదించిన తర్వాతే తగిన చికిత్సను ఎంచుకోవాలి. ప్రిస్క్రిప్షన్ స్ట్రెంత్ యాంటీ పెర్స్పిరెంట్స్ మామూలు డియోడరెంట్ల లాంటివి పనిచేయనప్పుడు డాక్టర్లను సంప్రదించాలి.

# మలబద్ధకం నుంచి బయట పడాలనుకుంటున్నారా..?



మారిన జీవన విధానం.. ఆహారపు అలవాట్లతో మలబద్ధకం లేదా కడుపులో గ్యాస్ చాలా సాధారణం. అయితే ఈ రెండు సమస్యలు చాలా ఇబ్బందికరమైనవి. మలవిసర్జన సమయంలో కొంతమంది తీవ్ర ఇబ్బందులను పడతారు. అయితే మలబద్ధకం సమయం బారిన పడితే నిర్లక్ష్యం వద్దు. ఇది అనేక వ్యాధులకు, ఆరోగ్య సమస్యలకు కారణంగా మారుతుంది. మలబద్ధకం ఉంటే ఆకలి తగ్గుతుంది. దానికి దూరం చేసేందుకు ఈ సూత్రాలు పాటించండి. ఉసిరికాయను తీసుకోవడం వల్ల మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరికాయను ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవాలి. ఒక గ్లాసు నీటిలో కొంచెం ఉసిరికాయ వేసి రాత్రంతా నానబెట్టండి. ఈ నీటిని ఉదయాన్నే మరిగించి చల్లారాక తాగాలి. ఉసిరి నీరు కడుపుని శుభ్రపరుస్తుంది. ప్రేగులలో పేరుకుపోయిన మలాన్ని సులభంగా తొలగిస్తుంది. త్రిఫల అనేది మూడు పదార్థాలతో కూడిన ఆయుర్వేద రసాయన సూత్రం. త్రిఫల అనేది అమలకీ, బిభితక హరితకీ మిశ్రమం. ఇది మన పేగుల్లో పేరుకుపోయిన మురికిని శుభ్రపరుస్తుంది. పేగుల్లోని మురికిని శుభ్రం చేయడంలో త్రిఫల చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. రాత్రి పడుకునే ముందు ఒక టీస్పూన్ త్రిఫల చూర్ణాన్ని గోరువెచ్చని నీటితో కలిపి తీసుకుంటే పొట్ట శుభ్రంగా ఉండి, పొట్టలో పేరుకుపోయిన మురికి తొలగిపోతుంది. అవిసె గింజలు కరిగే, కరగని ఫైబర్ రెండింటినీ కలిగి ఉంటాయి. ఈ రెండు ఫైబర్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. దీన్ని తీసుకోవడం వల్ల మలం మృదువుగా మారుతుంది. ఈ గింజల్లో ఉండే కరగని పీచు పేగులో కూరుకుపోయిన మలాన్ని మృదువుగా చేసి పొట్ట నుండి బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఖర్జూరాన్ని నెయ్యిలో వేసుకుని తింటే కూడా త్వరగా ఉపశమనం లభిస్తుంది. అయితే దీని కోసం మీరు ఖర్జూరాలను దేశీ నెయ్యిలో కొంత సమయం పాటు నానబెట్టాలి. ఖర్జూరంలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అదే సమయంలో, ఫైబర్ జీవక్రియను పెంచుతుంది.

# నిద్రలేమితో అవస్థపడుతున్నారా..?



ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది నిద్రలేమి సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. విపరీతమైన ఆలోచనలు, వయసుకు మించిన ఒత్తిడి, భవిష్యత్తుపై భయాందోళనలు, అనారోగ్య సమస్యలు, ఇతరత్రా కారణాల వలన నిద్రపై ప్రభావం పడుతుంది. అయితే, మీరు రోజూ తినే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా మీరు ప్రశాంతంగా నిద్రపోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేస్తే ఆ తర్వాతి ఉదయం తాజాదనంతో మేల్కొంటారని అంటున్నారు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం. నిద్ర అనేది రోజూ సమస్యగా మారితే.. అది మన రోగనిరోధక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఇందులో భాగంగానే ఎన్నో రోగాలు, ఇన్ఫెక్షన్లు మనల్ని ఎప్పటికప్పుడు వేధిస్తాయి. దృష్టిలోపం అనేది నిద్ర సమస్యలను కలిగించే మరొక సమస్య. దీని వల్ల కళ్ల పొడిబారడంతోపాటు కంటి నొప్పి కలుగుంది. నిద్ర సమస్యలు ఉన్నవారిలో కనిపించే మరో లక్షణం అధిక ఆకలి. మీరు సాధారణం కంటే ఆహారం పట్ల ఎక్కువ ఆకర్షితులవుతున్నట్లు అనిపిస్తే జాగ్రత్తగా ఉండండి. నిద్రలేమి సమస్య ఉన్న వ్యక్తులు బరువు విషయంలో తరచుగా సమస్యలు ఎదుర్కొంటారు. ఈ విషయాన్ని కూడా నిశితంగా పరిశీలించుకోవాలి. రెగ్యులర్ గా సరైన నిద్ర లేని వారు బరువు పెరిగే అవకాశం కూడా ఉంటుంది. అది మీరు గమనించాలి. అధిక ఒత్తిడి కూడా మిమ్మల్ని నిద్రలేమికి దారితీస్తుంది. అధిక ఒత్తిడికి కూడా నిద్ర లేకపోవడం కారణం అంటున్నారు నిపుణులు. నిద్రలేమితో ఆకలిని పుట్టించే హార్మోన్ గ్రెలిన్ ఎక్కువగా విడుదలై ఆకలి ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. కడుపు నిండిందనే భావన కల్పించే హార్మోన్ లెప్టిన్ తక్కువగా విడుదలై మరింత ఆహారం తినేవిధంగా చేసి ఊబకాయానికి దారితీస్తుంది. నిద్రలేమివల్ల మలబద్ధకం, డిప్రెషన్, కోపం, చిరాకు ఎక్కువవుతాయి. ఇది చివరికి ఎనిమీయాకు దారి తీస్తుంది. ఆకలి మందగించడం ఇతర సమస్యలు చుట్టుముడతాయి. కాబట్టి నిద్రలేమికి యోగా, వాకింగ్, సైక్లింగ్ వంటివి చేయాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. సిగరెట్, అల్కహాల్ వంటివాటికి దూరంగా ఉండడం మంచిది. మనిషికి మంచినిద్ర చాలా చాలా అవసరం. నిద్ర కరువైతే శరీరం రోగాలకు నిలయమవుతుంది. నిద్ర శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో కీలకం.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక




# శ్రీలంకలో పెద్ది పాట షూటింగ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం పెద్ది కోసం శ్రీలంకకు బయల్దేరారు. 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని అంటుతు న్నాయి. సినిమా షూటింగ్ కోసం హీరో రామ్ చరణ్ మరియు డైరెక్టర్ బుచ్చి బాబు సానా శ్రీలంకకు బయల్దేరారు. సమాచారం ప్రకారం, రేపటి నుండే అక్కడ పెద్ది షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ శ్రీలంక షెడ్యూల్‌లో, టీమ్ పెద్ది కొన్ని కీలకమైన సన్నివేశాలను, ఒక పాటను చిత్రీకరించనుంది. శ్రీలంకలోని అద్భుతమైన లొకేషన్లలో హీరో చరణ్, హీరోయిన్ జాన్వీ కాంబినేషన్లో ఈ పాటను షూట్ చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేసింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా మ్యూజికల్ అప్‌డేట్ గురించి కూడా ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. శ్రీలంకలో ఈ షూటింగ్ షెడ్యూల్ చురుకుగా పూర్తి చేసిన వెంటనే, ఈ సినిమా నుండి మొదటి సింగిల్‌ను విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷–లాన్ చేస్తున్నారు. విశేషమేమిటంటే, ఈ మొదటి సింగిల్ పాటలో శ్రీలంకలో చిత్రీకరించిన అద్భుతమైన విజువల్స్‌ను జత చేయనున్నారు. దీంతో, సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# రాజమౌళి-మహేశ్ బాబుల మూవీ

## మ్యూజిక్ సెషన్ మొదలయ్యిందన్న కాలభైరవ



ఎస్ఎస్ఎంబి 29 ప్రస్తుతం భారతీయ సినీ ఇండస్ట్రీలో క్రేజీ ప్రాజెక్ట్. మహేశ్‌బాబు కథానాయకుడిగా అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు కాల భైరవ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆయన స్వరాలు సమకూర్చిన 'మోగ్లీ' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మహేశ్–రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించి అప్‌డేట్‌ను ఇచ్చారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి సంగీత కార్యక్రమాలు మొదలైనట్లు తెలిపారు. నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే, కచ్చితంగా చెబుతారు. ముఖ్యంగా రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తా. ఎస్ఎస్ఎంబి 29కు సంబంధించి కూడా మ్యూజిక్ పనులు ఇటీవల మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా అని అన్నారు. దీంతో మహేశ్ అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీకి సంబంధించి అసలైన అప్‌డేట్ నవంబరులో రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం



అధికారికంగా ప్రకటించింది. టైటిల్‌ను వెల్లడించడంతో పాటు, ఓ వీడియోను కూడా విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులను కూడా పూర్తి చేశారట. హైదరాబాద్ వేదికగా ప్రెస్‌మీట్ లేదా ఈవెంట్‌ను నిర్వహించి వీడియోను విడుదల చేయనున్నారు. అప్పుడే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అనువైన వేదిక కోసం చిత్ర బృందం శోధన మొదలు పెట్టింది. నెలాఖరులోగా దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. వారణాశి నేపథ్యంగా సాగే కథతో రాజమౌళి దీన్ని తీర్చిదిద్దుతున్నారు.




# నవంబర్5న రాజాసాహెబ్ ఫస్ట్ సింగిల్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన రాజాసాబ్ ఫస్ట్ గ్లిమ్స్, ట్రైలర్ కు భారీ స్పందన వచ్చింది. రెబల్ స్టార్ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని సంగీత దర్శకుడు తమన్ ఆ మధ్య హింట్ ఇచ్చాడు కానీ ఎటువంటి అప్డేట్ ఇవ్వకుండా జస్ట్ పోస్టర్ తో సరిపెట్టారు మేకర్స్. దాంతో ఫ్యాన్స్ కాస్త డిజప్పాయింట్ అయ్యారు. కనీసం ఫస్ట్ సింగిల్ రిలీజ్ ఎప్పుడు ఉంటుందని డేట్ కూడా చెప్పలేదని సోషల్ మీడియాలో కామెంట్స్ చేసారు. తాజాగా పీపుల్స్ మీడియా నిర్మించిన మరో సినిమా మోగ్లీ ఫస్ట్ సింగిల్ లాంచ్ లో నిర్మాత విశ్వప్రసాద్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ' రాజసాబ్ ఫస్ట్ సింగిల్ ను నవంబరు 5న రిలీజ్ చేస్తాము. అలాగే జనవరి 9న వరల్డ్ వైడ్ గా సినిమా రిలీజ్ అవుతుంది. రిలీజ్ కు ముందు రాజాసాబ్ సెకండ్ ట్రైలర్ ను రిలీజ్ చేస్తాం' అని అన్నారు. రెబెల్ స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఫస్ట్ సింగిల్ అప్డేట్ రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.




# బాలయ్యతో గోపీచంద్ మలినేని మూవీ

నవంబర్ 7న పూజా కార్యక్రమాలతో మొదలు బాలయ్యకు వీరసింహ రెడ్డి వంటి సూపర్ హిట్ సినిమాను అందించిన గోపీచంద్ మలినేనితో మరో సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. రాయలసీమ నేపథ్యంలో వీరసింహ రెడ్డితో సూపర్ హిట్ ఇచ్చిన గోపీచంద్ మలినేని ఈ సారి సరికొత్త ప్రయోగానికి రెడీ అవుతున్నాడు. ఈ సినిమాపై ఇప్పటి నుండి అభిమానుల్లో అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఈ పవర్ఫుల్ కాంబోను అత్యంత భారీ బ్జడెట్ పై వృద్ధి సినిమాస్ బ్యానర్ లో సతీష్ కిలారు నిర్మించనున్నారు. ఎన్‌బికె111 టైటిల్ తో తెరకెక్కుస్తున్న ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లేందుకు ముహూర్తం ఫిక్స్ అయింది. నవంబరు 7 తారీఖున ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నారు. మాస్ యాక్షన్ అంశాలతో పాటు సినిమా రెండు వేరు వేరు కాలాలకు చెందిన హిస్టారికల్ స్టోరీ అని చరిత్రను.. వర్తమానాన్ని ముడిపెడుతూ ఎపిక్ స్టోరీని రెడీ చేసినట్టు తెలుస్తోంది. ఒకరకంగా టైమ్ ట్రావెల్ లాంటి కథలా ఉంటుందని బాలయ్యను మునుపెన్నడు చూడని విధంగా పవర్ఫుల్ గా ఉ ండబోతుందట అందుకు తగ్గట్టే దర్శకుడు కొన్ని రోజుల క్రితం మొరాకోలో అనౌన్స్‌మెంట్ షూటింగ్ కూడా ఫినిష్ చేసాడు దర్శకుడు గోపీచంద్. టెక్నికల్ టీమ్ విషయంలోను ఈ సారి ఎక్కడ కంప్రమైజ్ కావడం లేదు మేకర్స్. ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్ గా కాంతార కు పని చేసిన అర్వింద్ కశ్యప్ ను తీసుకున్నారు. ఇక సంగీత దర్శకుడిగా బాలయ్య ఆస్థాన వాయిద్యుడు తమన్ వర్క్ చేయబోతున్నారు. బాలయ్య కెరీర్ లో ఈ సినిమా బెస్ట్ వర్క్ ఫిల్మ్ అవుతుందని ఈ చిత్ర కథ తెలిసిన కొందరు టాలీవుడ్ సిర్కిల్స్ లో చెప్పుకుంటున్నారు.

# ఓటిటిలోకి వచ్చేస్తున్న ఇడ్లీకొట్టు

ధనుష్ , నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన వ్యక్తిత్వం కోసం ఉ ద్యోగాన్ని వదిలి.. తండ్రి వారసత్వంగా ఇడ్లీ కొట్టు నడిపే సాధారణ వ్యక్తి పాత్రలో ధనుష్ కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందడం, విజయవంతమైన 'తిరు' తర్వాత ధనుష్, నిత్యామేనన్ కలిసి నటించడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఆ స్థాయి వినోదాన్ని మాత్రం అందించలేకపోయింది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. అక్టోబరు 29వ తేదీ నుంచి నెట్‌ప్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ పోస్టర్‌ను పంచుకుంది. శివ కేశవులు (రాజ్‌కిరణ్) ఇడ్లీ కొట్టు అంటే ఆ ఊళ్లో ఫేమస్. ఎంతో ఇష్టంగా, మనసు పెట్టి చేసే ఆ కొట్లో ఇడ్లీలు ఎంతో రుచికరం. శివ కేశవులు కొడుకే మురళి (ధనుష్). కొత్తతరం కుర్రాడు కదా, తన తండ్రి నడుపుతున్న కొట్టుని కాస్త ఫ్రాంచైజీలా మార్చేసి, అదే పేరుతో ఇతర చోట్ల కూడా హోటల్స్‌ని ఏర్పాటు చేసి డబ్బు సంపాదించాలని ఆశపడతాడు. కానీ, తన చేతులతో చేయని ఇడ్లీలను తన పేరుతో అమ్మడానికి ససేమిరా ఇష్టపడడు శివకేశవులు. దాంతో మురళి ఉ న్నతమైన జీవితం అంటూ కన్నవాళ్లని, ఉన్న ఊరుని వదిలి పట్నం బాట పడతాడు. అలా మొదలైన అతని పరుగు బ్యాంకాక్‌కి చేరుతుంది. పనుల్లో పడి కన్నవాళ్లని కూడా పట్టించుకోడు. బ్యాంకాక్‌లోనే తన బిజినెస్‌లో పార్ట్‌నర్ అయిన విష్ణువర్ధన్ (సత్యరాజ్) కూతురు మీరా (షాలిని పాండే)తో పెళ్లి నిశ్చయమవుతుంది. మరికొన్ని రోజుల్లో పెళ్లి అనగా మురళి తండ్రి శివ కేశవులు చనిపోతాడు. తండ్రి చివరి చూపు కోసం వచ్చిన మురళి తిరిగి బ్యాంకాక్ వెళ్లాడా లేదా?శివకేశవులు చనిపోయాక ఆయన ఇడ్లీ కొట్టు ఏమైంది?మురళికీ, కల్యాణి (నిత్య మేనన్)కీ మధ్య సంబంధం ఏమిటి?మీరాతో అతని పెళ్లి జరిగిందా? అన్నది చిత్ర కథ.




# ఓటిటిలోకి 31న వస్తోన్న కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది 'కొత్తలోక: చాప్టర్ 1' కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిందీ సినిమా. ఈ మూవీ ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా? అని అభిమానులు ఎదురుచూశారు. తాజాగా వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ జియో హాట్‌స్టార్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 31 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది. తెలుగు, మలయాళం, తమిళ, హిందీతో పాటు బెంగాలీ, మరాఠీలలోనూ ఇది స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్ విడుదల చేసింది. చంద్ర అలియాస్ నీలి (కల్యాణి ప్రియదర్శన్) అతీంద్రియ శక్తులు కలిగి ఉంటుంది. ఒక మిషన్‌లో ఆమె త్రుటిలో శత్రువుల నుంచి తప్పించుకుంటుంది. దీంతో చంద్ర స్వీడన్ నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యి తన గురించి ఎవరికీ తెలియకుండా ఒక కేఫ్‌లో పనిచేస్తూ ఉంటుంది. ఆమె పక్కింట్లో ఉండే సన్నీ (నస్లేన్) ఆమెతో స్నేహం పెంచుకుంటాడు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ నాచియప్ప గౌడ (శాండి మాస్టర్), అతడి బాస్ మానవ అవయవాల అక్రమ రవాణా చేస్తుంటారు. అనుకోకుండా తారసపడిన చంద్రపై నాచియప్పకు అనుమానం కలుగుతుంది. మరి ఆ తర్వాత అతడు ఏం చేశాడు? అసలు చంద్ర ఎవరు..? ఆమెను చూసి సన్నీ ఎందుకు అంతగా భయపడ్డాడు? అనేది చిత్ర కథ.

ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూలు చేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది.




Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.